

ధాన్యం సేకరణకు గోనె సంచుల కొరత

- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యాసంగి సీజన్‌లో ధాన్యం సేకరణ లక్ష్యానికి అనుగుణంగా గోనె సంచు (గన్నీ బస్తా)లు సిద్ధంగా లేవు. కొన్ని జిల్లాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై రెండు వారాలైంది. మరికొన్ని చోట్ల ఈ నెల 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. రైతుల ధాన్యం తూకం వేసేందుకు, రైస్ మిల్లులకు రవాణా చేయడానికి గోనె సంచులు తప్పనిసరి. కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి ముందే సంచులను సిద్ధం చేసుకోవాల్సి ఉన్నా.. అధికారులునిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. యాసంగిలో రాష్ట్ర వ్యాప్తంగా 66.08 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. 1.20 కోట్ల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. ఇందులో 75.40 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని పౌర సరఫరాల సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందు కోసం 18.85 లక్షల గోనె సంచులు అవసరం. ఇందులో 54 శాతం కొత్తవి, 46 శాతం పాత సంచుల కొనుగోలుకు కేంద్రం అనుమతిస్తుంది. ఈ క్రమంలో 10.18 లక్షల కొత్త సంచులకుగానూ 9.49 లక్షల సంచుల్ని పౌర సరఫరాల సంస్థ కేంద్ర జౌళి శాఖ ద్వారా కొనుగోలు చేసింది. సమస్యంతా పాత సంచుల సేకరణలోనే ఉంది. 8.67 లక్షలకుగానూ మిల్లర్ల నుంచి 89 వేలే సమకూరాయి. ఇంకా 7.78 లక్షల పాత సంచుల అవసరం ఉంది. గత సీజన్‌లో ధాన్యం బస్తాలు రైస్ మిల్లులకు వెళ్లాక.. వడ్లను మిల్లింగ్ చేసి, ఖాళీ సంచులను మిల్లర్లు పౌర సరఫరాల సంస్థకు తిరిగివ్వాలి. కానీ చిరిగిపోయాయంటూ, తడిసిపోయాయంటూ సంచుల సంఖ్యను తగ్గిసూ మాయాజాలంచేస్తున్నారన్న ఆరోపణలు న్నాయి. దీంతో ప్రతి సీజన్‌లో లక్షల సంచుల్ని కొనాల్సి వస్తోంది. పౌర సరఫరాల సంస్థ గతంలో చౌక ధరల దుకాణాల నుంచి పాత గన్నీ సంచులు కొనుగోలు చేసేది. ప్రస్తుతం ప్రయివేటు వ్యాపారుల నుంచి కొంటున్నారు. ఒక్కో సంచిని రూ.22 చొప్పున కొంటామని గతేడాది జూన్‌లో పౌరసరఫరాల సంస్థ ఇచ్చిన జిఒ మూడు నెలలు మాత్రమే అమలైంది. డీలర్ల నుంచి పాత బస్తాలను పౌరసరఫరాల సంస్థ కొనడం లేదు. అదే సమయంలో ప్రయివేటు వ్యాపారులు డీలర్ల దగ్గర గన్నీ సంచులు కొంటున్నారు. వారే టెండర్లలో పాల్గొని పౌరసరఫరాల సంస్థకు అధిక ధరకు విక్రయిస్తున్నారు.

రాజకీయాలకు అతీతంగా విద్యుత్తు సంస్థలపై విచారణ

- బాధ్యులందరికీ నోటీసులు
- త్వరలో ప్రజాభిప్రాయ సేకరణ
- వంద రోజుల్లో నివేదిక : జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి
- విద్యుత్ ఒప్పందాలు, టెండర్లపై న్యాయ విచారణ షురూ



ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

భద్రాద్రి, యాదాద్రి విద్యుత్తు కేంద్రాల నిర్మాణం, ఛత్తీస్‌గఢ్ ఒప్పందంతో సంబంధం ఉన్నవారందరినీ విచారిస్తామని జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. వంద రోజుల్లో దీనిపై నివేదిక రూపొందించి ప్రభుత్వానికి ఇస్తామని చెప్పారు. పై విద్యుత్ ప్లాంట్ల నిర్మాణానికి సంబంధించి అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం కాంపిటీటివ్ బిడ్డింగ్‌కు వెళ్లకుండా నామినేషన్ల ప్రాతిపదికన పనులను కాంట్రాక్టర్లకు అప్పగించడం, ఛత్తీస్‌గఢ్ డిస్కంల నుంచి వెయ్యి మెగావాట్ల విద్యుత్ కొనుగోలు ఒప్పందంపై న్యాయ విచారణ జరిపేందుకు పాట్నా హైకోర్టు రిటైర్డ్ చీఫ్ జస్టిస్ ఎల్ నరసింహారెడ్డిని 'కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ'గా నియమిస్తూ గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. బూర్గుల రామకృష్ణారావు భవన్‌లోని 7వ అంతస్తులో కమిషన్ ఆఫ్ ఎంక్వైరీకి కేటాయించిన కార్యాలయంలో ఆదివారం జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి న్యాయ విచారణ ప్రక్రియను ప్రారంభించారు. ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి, ట్రాన్స్‌కో, జెన్‌కో సంస్థల సిఎండి ఎస్ఎం రిజ్వీతో పాటు ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం అక్కడే నిర్వహించిన విలేకరుల సమావేశంలో కమిషన్ లక్ష్యాలు వివరించారు. పై అంశాలకు సంబంధించిన సమాచారం, సాక్ష్యాలు, ఆధారాలను ఎవరైనా కమిషన్ దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. ఈ అంశాలతో సంబంధం ఉందని కమిషన్ భావిస్తే మాజీ ముఖ్యమంత్రి, మాజీ మంత్రులను కూడా విచారణకు పిలుస్తామని విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. మొదట రిక్వెస్ట్ లెటర్స్ రాస్తామనీ, వాటికి స్పందించకుంటే సమన్లు పంపుతామన్నారు. కమిషన్‌కు ఆ అధికారాలు ఉన్నాయని స్పష్టం చేశారు. మూడు ఒప్పందాలకు సంబంధించిన ఫైళ్లు తమ కార్యాలయానికి చేరాయని ఆయన తెలిపారు. వాటి ప్రాథమిక పరిశీలన కూడా పూర్తయ్యిందని, అవసరమైతే మిగిలిన ఫైళ్లను అడుగుతామన్నారు. దీనిపై త్వరలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తామనీ, దీనికోసం త్వరలో బహిరంగ ప్రకటన విడుదల చేస్తామన్నారు. తమ వద్ద ఉన్నసమాచారాన్ని ఎవ్వరైనా ఈ-మెయిల్ లేదా లేఖల తమ కార్యాలయానికి పంపొచ్చన్నారు. సాంకేతిక పరిజ్ఞానం కలిగిన కొద్ది మంది వ్యక్తుల నుంచి సమాచార సేకరణ కోసం బహిరంగ విచారణ కూడా నిర్వహిస్తామన్నారు. విద్యుత్ ఉద్యోగులు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టిఎస్ఇఆర్‌సి) బహిరంగ విచారణలకు హాజరు కావద్దని గతంలో ఆంక్షలు విధించారనే విషయాన్ని విలేకరులు కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. దానిపై విద్యుత్ సంస్థల అభిప్రాయం తీసుకుంటామనీ, దూషణలు, రాజకీయ విమర్శలకు తావులేకుండా విచారణకు సహకరించాలని ఆయన కోరారు.

ప్రజా సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులే : సిపిఎం

- భువనగిరి ఎంపి అభ్యర్థి జహంగీర్ గెలుపునకు ఇంటింటి ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడేది కమ్యూనిస్టులేనని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండ శ్రీశైలం అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా చండూరు మండలం నేర్మట గ్రామంలో భువనగిరి పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి ఎండి జహంగీర్ గెలుపు కోసం ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భువనగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో కమ్యూనిస్టులు ప్రాతినిధ్యం వహించి అభివృద్ధి చేశారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిస్టులను గెలిపించుకోవాలని తెలిపారు. తెలంగాణ ప్రాంత అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తూ.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వివక్ష చూపిందన్నారు. ఓటు అడిగే నైతిక హక్కు బిజెపికి లేదన్నారు. అభ్యుదయవాదులకు, అవకాశవాదులకు మధ్య ఈ పోటీ కొనసాగుతుందన్నారు. డబ్బులు వెదజల్లి గెలవాలని చూస్తున్న పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ ప్రాంతంలో భూ పోరాటాలతోపాటు, తాగు, సాగునీటి కోసం అవిశ్రాంత పోరాటాలు నిర్వహించి సాధించామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసి సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించేతత్వం కమ్యూనిస్టులకు మాత్రమే ఉందన్నారు. గత యుపిఎ ప్రభుత్వంలో వామపక్షాల బలం ఉన్న కారణంగానే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, అటవీ హక్కుల చట్టాన్ని సాధించుకున్నామన్నారు. కార్యక్రమంలో సిపిఎం చండూరు మండల కార్యదర్శి మొగుదాల వెంకటేశం, నాయకులు జెర్రిపోతుల ధనంజయగౌడ్, సీనియర్ నాయకులు అంతిరెడ్డి, సిపిఎం గ్రామ నాయకులు ఈరటి వెంకన్న, బుర్కల అంజయ్యగౌడ్, ఈరగట్ల స్వామి, బల్లెం స్వామి, కొత్తపల్లి లక్ష్మమ్మ, యాదయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయండి

- సికింద్రాబాద్, వరంగల్ నియోజకవర్గాల నేతలతో సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 14 పార్లమెంటు నియోజకవర్గాల గెలుపే లక్ష్యంగా పని చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. మన గురి తప్పకూడదని తెలిపారు. బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు పరస్పరం సహకరించుకుంటున్నాయని చెప్పారు. ఆ రెండు పార్టీలను ఓడించేందుకు రెట్టింపు ఉత్సాహంతో కష్టపడి పని చేయాలన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో సిఎం రేవంత్‌రెడ్డి సికింద్రాబాద్, వరంగల్ నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నేతలతో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఆయా నియోజవర్గాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై దిశా నిర్దేశం చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్ ఒక్క సీటు కూడా సాధించలేదన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలన్నారు. కేంద్ర మంత్రి, బిజెపి నేత కిషన్‌రెడ్డి సికింద్రాబాద్‌కు చేసిందేమీ లేదని విమర్శించారు. ఈ ప్రాంతంలో ఎన్నో పెండింగ్ సమస్యలు ఉన్నాయనీ, అయినా ఆయన పట్టించుకోలేదన్నారు. వరంగల్ నియోజకర్గం అభ్యర్థిని ఓడిస్తామంటూ బిఆర్ఎస్ నేతలు పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. వరంగల్ నియోజకవర్గం సమావేశంలో మంత్రి కొండా సురేఖ, సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, అభ్యర్థి కడియం కావ్య, ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు. సికింద్రాబాద్ సమావేశంలో అభ్యర్థి దానం నాగేందర్, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు అజహరుద్దీన్, విజయారెడ్డి, ఆదం సంతోష్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఫిరోజ్‌ఖాన్, రోహిన్‌రెడ్డి, నీలిమా తదితరులు పాల్గొన్నారు.

పంచ న్యాయాల పేరుతో పంగనామాలకు తెర

- ఎంపి డాక్టర్ కె లక్ష్మణ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇస్తామన్న రూ.2,500కే దిక్కు లేదుగానీ దేశవ్యాప్తంగా ఒక్కో మహిళకు లక్షరూపాయలిస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందని బిజెపి ఒబిసి మోర్చా జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె లక్ష్మణ్ ఎద్దేవా చేశారు. ఆదివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఒబిసి మోర్చా తెలంగాణ శాఖ డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ సామాజిక న్యాయం గురించి మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్టుందన్నారు. అంబేద్కర్‌ను కాంగ్రెస్ పార్టీ అవమానించి ఆయన ఫొటోను వాడుకుంటున్నదని విమర్శించారు. చరణ్‌సింగ్, పివి నర్సింహారావు కాంగ్రెస్ అవమానిస్తే మోడీ ప్రభుత్వం భారతరత్న ఇచ్చి గౌరవించిందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు రాజకీయంగా మోడీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందనీ, దానికి క్యాబినెట్‌లోని మంత్రుల సంఖ్యనే నిదర్శనమని చెప్పారు. ఆదివాసీ బిడ్డ అయిన రాష్ట్రపతి ద్రౌపదిముర్మును ఓడించడానికి కాంగ్రెస్ ప్రయత్నించిందని విమర్శించారు.

కంటోన్మెంట్ బిఆర్ఎస్ అభ్యర్థిగా నివేదిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ స్థానం ఉప ఎన్నికకు బిఆర్ఎస్ అభ్యర్థిగా నివేదిత పేరు దాదాపు ఖరారైంది. కంటోన్మెంట్ బిఆర్ఎస్ నేతలతో అధినేత కెసిఆర్ ఆదివారం సమావేశమయ్యారు. మాజీ మంత్రులు కెటిఆర్, హరీశ్‌రావు, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, లోక్‌సభ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, నివేదిత, క్రిశాంక్, గజ్జెల నగేష్ సహా ఇతర నేతలు సమావేశంలో పాల్గొన్నారు. ఉప ఎన్నికకు అంశాలపై నేతలతో చర్చించిన కెసిఆర్.. వారికి దిశానిర్దేశం చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కంటోన్మెంట్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. లోక్‌సభ ఎన్నికలతోపాటే కంటోన్మెంట్ ఉప ఎన్నిక కూడా జరగనుంది. లాస్య నందిత సోదరి, దివంగత సాయన్న కుమార్తె నివేదితను పార్టీ అభ్యర్థిగా బరిలో నిలపాలని బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. ఈ మేరకు నేతల సమావేశంలో నివేదిత పేరు చెప్పినట్టు సమాచారం.

ఏడిపిస్తున్న ఎర్ర బంగారం

- నిండిన కోల్డ్ స్టోరేజ్‌లు
- ఎగుమతి లేదంటూ ధరలు తగ్గిస్తున్న వైనం
- కేంద్రం విధానాలతో మిర్చి రైతులకు తీవ్ర నష్టం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆసియాలోనే అతిపెద్ద రెండవ మార్కెట్ అయిన వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ఎర్ర బంగారంతో కళకళలాడుతున్నా ధరలు లేక రైతులు కంట నీరు పెడుతున్నారు. ఆరుగాలం శ్రమించి పంటను మార్కెట్‌కు తీసుకువస్తే గిట్టుబాటు ధర లేక పెట్టుబడులు దక్కడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటసాగు చేసేందుకు ఆరంభం నుంచి లక్షలాది రూపాయలు ఖర్చు చేసినట్టు రైతులు వాపోతున్నారు. పెట్టుబడి ఖర్చులు రెట్టింపైనా పంట విక్రయిస్తే అందులో సగం కూడా వచ్చే పరిస్థితి లేదు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చి ఎగుమతి విధానంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కేంద్రం వైఖరి పట్ల రైతులు తీవ్రంగా మండి పడుతున్నారు. మార్కెట్‌లో మిరప ఎగుమతి లేకపోవడంతో వ్యాపారులు తక్కువ ధరకు కొంటున్నారు.

వరంగల్ మార్కెట్‌కు భారీగా మిర్చి రాక..

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు ఉమ్మడి వరంగల్ జిల్లా నుండే కాకుండా అదిలాబాద్, కాగజ్ నగర్, మంచిర్యాల, చెన్నూరు, రంగారెడ్డి, నాగర్ కర్నూల్, వనపర్తి, నల్లగొండ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి రైతులు ఎక్కువ సంఖ్యలో తమ పంట ఉత్పత్తులను అమ్ముకునేందుకు వరంగల్ మార్కెట్‌కు వస్తుంటారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి పంట దిగుబడి పెరిగినా ధరలు మాత్రం చాలా తగ్గాయి. గతేడాది జనవరి నెలలో 53,025 క్వింటాళ్ల (1,32,564 బ్యాగ్స్) మిర్చి రాగా గరిష్ట ధర రూ.81,000లు పలికింది. ఈ ఏడాది జనవరిలో 1,24,163 క్వింటాళ్లు (3,07,439 బ్యాగ్స్) రాగా ధర రూ.24,000 మాత్రమే పలుకుతోంది. గతేడాది మార్చిలో మార్కెట్‌కు 2,83,929 క్వింటాళ్లు (7.09,823 బ్యాగ్స్) మిర్చి రాగా ధర గరిష్టంగా రూ.80,000 పలకగా, ఈ ఏడాది మార్చిలో 3,12,260 క్వింటాళ్లు (7,80,651 బ్యాగ్స్) అమ్మకానికి తీసుకురాగా ధర గరిష్టంగా రూ.21,200 పలికింది.

నిండిన కోల్డ్ స్టోరేజ్‌లు..

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలోని మొత్తం 25 కోల్డ్ స్టోరేజ్‌లు ఉండగా అందులో 275000 బస్తాలు నిల్వ చేసుకునే సామర్థ్యం ఉంది. అందులో ఇప్పటికే 25 లక్షల పైచిలుకు బస్తాలు నిల్వ చేసుకున్నారు అయితే గతేడాది ప్రారంభంలో కోల్డ్ స్టోరేజ్‌లో ఉన్న మిర్చికి అనూహ్యంగా ధరలు పలకడంతో రైతులు, ట్రేడర్లు పెద్ద సంఖ్యలో అంటే దాదాపు 7 లక్షల బస్తాలకు పైగా మిర్చిని విక్రయించకుండా కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచారు. ఈ ఏడాది గతేడాది కంటే ధరలు తగ్గడంతో కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ ఉన్న మిర్చిని రైతులు, ట్రేడర్లు అమ్మలేకపోయారు. దాంతో కోల్డ్ స్టోరేజ్‌ల్లో పెట్టేందుకు సామర్థ్యానికి మించి బస్తాలు వస్తుండటంతో స్థలం లేక రైతులు ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడింది.

ఎగుమతులు లేవని ధరలు తగ్గిస్తున్న వ్యాపారులు..

ఏనుమాముల వ్యవసాయం మార్కెట్‌కు వచ్చిన మిర్చిని వ్యాపారులు చైనా, వియత్నాం, బంగ్లాదేశ్, థాయ్‌లాండ్, మలేషియా తదితర దేశాలకు ఎగుమతి చేస్తారు. కానీ ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు ఆశాజనకంగా లేవని వ్యాపా రులు చెబుతున్నారు. అంతర్జాతీయంగా ఎగుమతులు లేకపోవ డానికి ప్రధాన కారణం కేంద్రం అనుసరించిన విధానమేనని తెలుస్తోంది. దాన్ని సాకుగా చూపి వ్యాపారులు ధరలు మరింత తగ్గిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకొని మిర్చి రైతుకు గిట్టుబాటు ధర అందే విధంగా చూడాలని వేడుకుంటున్నారు.

'భువనగిరి' అభివృద్ధి సిపిఎంతోనే సాధ్యం

- రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఎండి అబ్బాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భువనగిరి పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు నియోజకవర్గాల అభివృద్ధి సిపిఎంతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్ అన్నారు. జనగామ జిల్లా పసరమడ్ల గ్రామంలో గడ్డం ప్రభాకర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో అబ్బాస్ మాట్లాడారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో సిపిఎం నుంచి పోటీ చేస్తున్న ఎండి జహంగీర్ గెలుపునకు పార్టీలోని ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. గత బిఆర్ఎస్ పాలకుల పుణ్యమా అని భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. పార్లమెంటులో వామపక్షాల బలం తగ్గడంతో బిజెపి, కార్పొరేట్ శక్తులు పదేళ్ల నుంచి ప్రజా వ్యతిరేక బిల్లులను తీసుకొచ్చి పార్లమెంట్‌లో ఆమోదింపచేసుకుంటున్నాయని ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్యం అత్యంత ప్రమాదంలో పడిందని, భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నుంచి ఎంతోమంది అమరవీరులు.. తమ ప్రాణాలను సైతం త్యాగం చేసి పేదలకు పది లక్షల ఎకరాల భూమి పంచిన చరిత్ర ఎర్రజెండాకు ఉందన్నారు. అంతటి చరిత్ర కలిగిన ఎర్ర జెండాను ఆదరించి ప్రశ్నించే గొంతును పార్లమెంటుకి పంపించి ప్రజా సమస్యల పరిష్కారానికి భువనగిరి పార్లమెంటు అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఇందుకు భువనగిరి పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి ఎండి జహంగీర్ సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సాంబరాజు యాదగిరి, జిల్లా కమిటీ సభ్యులు సుంచు విజేందర్, నాయకులు అన్నబోయిన రాజు, బెజ్జరమైన మల్లేశం, గంధమాల యాదగిరి, ఎర్రబోయిన కరుణాకర్, బెజ్జరమైన శ్రీను, బోయిని స్వాములు, బోయిని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టోల్ ట్యాక్స్‌కు కొత్త పద్ధతి

- ఆర్ఎఫ్ఐడి టెక్నాలజీతో ఫీజు వసూలు
- అమలుకు చాలా సమయం పట్టే అవకాశం..!



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టోల్ ట్యాక్స్ చెల్లింపు విధానంలో కేంద్రం ఓ కొత్త విధానాన్ని తీసుకురాబోతుంది. టోల్ చార్జీలను ఆటోమేటిక్‌గా వసూలు చేసుకునే విధంగా రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్ఎఫ్ఐడి) టెక్నాలజీ రాబోతుంది. కారులో, ఇతర వాహనంలో ఉండే జిపిఎస్ పరికరం ద్వారా ప్రయాణ మార్గాన్ని గుర్తించి ఫీజును వసూలు చేస్తారు. కాకపోతే ఈ విధానం అమలుకు సమయం ఎక్కువ తీసుకునే అవకాశం ఉంది.

జాతీయ రహదారిపై వెళ్తున్నప్పుడు మధ్యలో టోల్‌గేట్స్ వద్ద టోల్ ట్యాక్స్ చెల్లించడం ప్రస్తుతం తప్పనిసరి. ప్రస్తుతం ఫాస్టాగ్స్ ద్వారా చెల్లింపులు జరుగుతున్నాయి. అయితే, పండుగలు, ప్రత్యేక రోజుల సమయాల్లో టోల్ ప్లాజాల వద్ద వాహనాల రద్దీ పెరుగుతోంది. తాజాగా ఫాస్ట్‌ట్యాగ్ విధానానికి కేంద్ర ప్రభుత్వం బైబై చెప్పబోతోంది. ఈ మేరకు కొత్తగా జిపిఎస్ విధానాన్ని తీసుకురాబోతోంది. టోల్ వసూళ్లకు గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం (జిఎస్)ను అమలు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఇటీవల కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కూడా జిపిఎస్ విధానాన్ని ప్రకటించారు. దాని ప్రకారం అన్ని టోల్ ప్లాజాలు, టోల్ కలెక్షన్ బూతులను తొలగించి జిపిఎస్ ఆధారిత వ్యవస్థను అమలు చేస్తారని తెలిసింది. సాధారణంగా జాతీయ రహదారులపై ప్రయాణం చేస్తున్నప్పుడు టోల్ ప్లాజాలు ఉంటాయి. కార్లు, జీపులు, లారీలు, బస్సులు, ఇతర పెద్ద వాహనాలు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. టోల్ ప్లాజాల వద్ద టోల్ చెల్లించడానికి వాహనాలు బారులు తీరి ఉంటాయి. అందరూ డబ్బులు చెల్లించి ముందుకు వెళ్లాలంటే చాలా సమయం పడుతుంది. అందుకు ప్రభుత్వం 2017లో ఫాస్ట్‌ట్యాగ్ విధానాన్ని తీసుకొచ్చింది. దీని ద్వారా చాలా సులభంగా టోల్ చెల్లించి ప్రయాణికులు ముందుకు వెళ్తున్నారు. ఇప్పుడు ఫాస్ట్‌ట్యాగ్ విధానాన్ని కూడా ప్రభుత్వం రద్దు చేయాలనుకుంటోంది.

ఆర్ఎఫ్ఐడీ టెక్నాలజీతో కొత్త విధానం

రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్ఎఫ్ఐడి) టెక్నాలజీతో పనిచేసే కొత్త విధానం ద్వారా టోల్ చార్జీలను ఆటోమేటిక్‌గా వసూలు చేసే విధానాన్ని రూపొందిస్తున్నారు. త్రీ జీ కనెక్టివిటీతో మైక్రో కంట్రోల్ ద్వారా ఈ సాంకేతికతను అమలు చేయాలని ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. కారులో ఉండే జీపీఎస్ పరికరం ద్వారా వాహనం మార్గాన్ని ఎన్‌హెచ్‌ఏ, రెగ్యులేటరీ ఏజెన్సీ పరిశీలిస్తుంది. వాహనం ఏ రోడ్ల మీదుగా వెళ్తోంది.. ఎన్ని టోల్ గేట్ల మీదుగా ప్రయాణం సాగిస్తుందని అది గుర్తిస్తుంది. జీపీఎస్ ఆధారిత సిస్టమ్ బహుశా హైవేల వెంట అమర్చే కెమెరాల ద్వారా ఆటోమేటిక్ నెంబర్ ప్లేట్ రికగ్నిషన్ సిస్టమ్‌ను ఉపయోగిస్తుందని తెలుస్తోంది. దాని ఆధారంగా వాహన యజమాని నుంచి ఫీజు వసూలు చేస్తారు. అయితే, ఆ నగదు నేరుగా బ్యాంకు ఖాతా నుంచి తీసుకుంటారని సమాచారం. ఈ పద్ధతిలో అన్ని వాహనాలకు జీపీఎస్ తప్పనిసరిగా ఉండాలి. ఈ కొత్త పద్ధతిని అమలు చేయడం అంత సులువు కాదని తెలుస్తోంది. ప్రతి కారు సాంకేతికతను కలిగి ఉండటానికి కొంత సమయం పడుతుందని పలువురు నిపుణులు చెబుతున్నారు.

ఎండల వేళ.. నగరవాసులకు మెట్రో షాక్!

- కార్డులపై రాయితీలు రద్దు చేసిన మెట్రో
- సువర్ణ ఆఫర్‌తో మెట్రోకు పెరిగిన రద్దీ
- నగర ప్రయాణికులపై అదనపు భారం
- మెట్రోలో రోజుకి ఐదు లక్షల మంది జర్నీ



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నగరంలో అసలే ఎండలు మండిపోతున్నాయి. ఈ ఎండలకు కూల్ జర్నీ చేద్దామనుకున్న గ్రేటర్ ప్రయాణికులకు హైదరాబాద్ మెట్రో గట్టి షాకిచ్చింది. ఇప్పటివరకు మెట్రో ప్రయాణికులకు కార్డులపై ఇచ్చిన రాయితీలను పూర్తిగా రద్దు చేసింది. ప్రస్తుతం మెట్రో కార్డుపై 10శాతం రాయితీతో పాటు హాలీడే కార్డును పూర్తిగా రద్దు చేసినట్టు మెట్రో అధికారులు తెలిపారు. మెట్రో అధికారుల నిర్ణయంతో నగర ప్రయాణికులపై అదనపు భారం పడనుంది.

హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ కరోనా తర్వాత మెట్రో ప్రయాణికులకు ఆకర్షించేందుకు ఎప్పటికప్పుడు కొత్త ఆఫర్ల ప్రకటిస్తూ వచ్చింది. దీంతో నగర ప్రజలూ ఈ ఆఫర్లను వినియోగించుకునేందుకు ఆసక్తి కనబరుస్తూ వచ్చారు. రెండేళ్ల క్రితం హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ సూపర్ సేవర్ ఆఫర్-59ను ప్రవేశపెట్టింది. సెలవు దినాలు, పండుగల రోజుల్లో ఉపయోగపడే ఈ ఆఫర్‌కు ప్రజల నుంచి విపరీతమైన ఆదరణ లభించింది. ఫలితంగా మెట్రో రైలులో రోజువారి ప్రయాణికుల రద్దీ పెరిగింది. దీంతో గతేడాది సూపర్ సేవర్ ఆఫర్-59 స్థానంలో 99 రూపాయలకు పెంచింది. అయినప్పటికీ మెట్రో ప్రయాణికుల నుంచి ఆదరణ తగ్గలేదు. ఇక అదే సమయంలో ప్రయాణికుల తాకిడి తట్టుకునేందుకు అప్పటివరకు రద్దీ వేళల్లో ప్రయాణికులకు ఇచ్చిన రాయితీలకూ కోత పెట్టింది. గతంలో మెట్రో కార్డు, క్యూ ఆర్ కోడ్‌పై ప్రతి ప్రయాణ చార్జీల్లో 10 శాతం డిస్కౌంట్ ఉండేది. దీనిని గతేడాది నుంచి కేవలం ఆఫ్ పీక్ అవర్స్‌లో ఉదయం ఆరు నుంచి ఎనిమిది గంటల వరకు, రాత్రి ఎనిమిది నుంచి 12 గంటల వరకు మాత్రమే కాంటాక్ట్ లెస్ స్మార్ట్‌కార్డుల (సిఎస్‌సి)పై 10శాతం రాయితీని ఇచ్చింది. ఇప్పుడు దీనిని సైతం పూర్తిగా ఎత్తివేసింది. దీంతో మెట్రో అధికారులు తాజాగా తీసుకున్న నిర్ణయంపై ప్రయాణికులు మండిపడుతున్నారు. నగరంలో ట్రాఫిక్ రహిత, సురక్షితమైన, వేగవంతమైన ప్రయాణం అందిస్తున్న తరుణంలో రాయితీలు ఎత్తివేయడంపై సామాన్య, మధ్య తరగతి ప్రజలు మెట్రో ప్రయాణాలకు దూరమయ్యే అవకాశం ఉందని, హాలీడే కార్డుతో పాటు మెట్రో కార్డు, క్యూఆర్ కోడ్‌పై ఎల్అండ్‌టి మెట్రో అధికారులు యథావిధిగా పదిశాతం డిస్కౌంట్ కొనసాగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రద్దీకి అనుగుణంగా రైళ్లను పెంచని మెట్రో

నగరంలోని నాగోల్-రాయదుర్గం, ఎల్బీనగర్-మియాపూర్, జెబిఎస్-ఎంజిబిఎస్ మూడు కారిడార్లలోని 57 స్టేషన్ గుండా ప్రతిరోజు వెయ్యికిపైగా మెట్రో సర్వీసులు నడుస్తుండగా.. 5లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఉదయం ఆరు నుంచి రాత్రి 12 గంటల వరకు నడుస్తున్న రైళ్లలో ఎప్పుడూ రద్దీ ఉంటోంది. కాలేజీ విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు మొదలుకుని వివిధ తరగతుల ప్రజలు మెట్రో రైళ్లను వినియోగించుకుంటున్నారు. ముఖ్యంగా నగరంలో ఎలాంటి ట్రాఫిక్ చిక్కులు లేకుండా తక్కువ సమయంలో ప్రజలు, ఉద్యోగులు తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. దాంతో ఉదయం, సాయంత్రం వేళల్లో, సెలవు రోజుల్లో మెట్రో ప్రయాణంపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఇక గత కొన్ని రోజులుగా ఎండలు దంచికొడుతుండటంతో ప్రజలు మెట్రోకి క్యూ కడుతున్నారు. మెట్రో రైళ్లు ఫుల్ రష్‌తో నడుస్తున్నాయి. మెట్రో రైళ్లలో కాలుతీసి కాలు పెట్టలేనంత మంది ప్రయాణికులు జర్నీ చేస్తున్నారు. అయితే రద్దీకి సరిపడ రైళ్లను పెంచని మెట్రో యాజమాన్యం... రాయితీలను ఎత్తి వేయడం ఏంటని ప్రయాణికులు మండిపడుతున్నారు. మెట్రో అధికారులు ఇప్పటికైనా తమ నిర్ణయాన్ని పునరాలోచన చేయాలని ప్రయాణికుల డిమాండ్ చేస్తున్నారు.

కాంగ్రెస్‌లోకి బిఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భద్రాచలం బిఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం హైదరాబాద్‌లోని సిఎం రేవంత్‌రెడ్డి నివాసంలో ఆయన హస్తం గూటికి చేరారు. సిఎం రేవంత్ ఆయనకు కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ కీలక నేత, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి అనుచరుడిగా ఉన్న తెల్లం వెంకట్రావ్ శనివారం జరిగిన తక్కుగూడలో కాంగ్రెస్ నిర్వహించిన జనజాతర సభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వేదికపై ఆయన రాహుల్‌గాంధీని కలిశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వడదెబ్బతో మహిళ మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వడదెబ్బతో మహిళ మృతి చెందిన సంఘటన సూర్యాపేట జిల్లా కోదాడ మండలం తొగర్రాయి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కన్నెబోయిన కోటమ్మ (50) కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వేసవి తాపానికి తట్టుకోలేక వడదెబ్బ తగిలి ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి, అమరనేని వెంకటేశ్వర్‌రావు, గ్రామస్తులు ఆమె మృతదేహానికి ఘన నివాళు లర్పించారు. మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు.

మయూరి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రికి షోకాజ్ నోటీస్

- ఆపరేషన్ థియేటర్ సీజ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం నగరంలోని మయూరి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి మాలతి, ఉప జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.సైదులు.. తమ సిబ్బందితో కలిసి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఆపరేషన్ థియేటర్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా మాలతి మాట్లాడుతూ.. ఆస్పత్రి లో నిబంధనలు పాటించకుండా, ఆపరేషన్ థియేటర్‌లో ఉపయోగించిన వాయిల్స్, లోడెడ్ సిరంజీలు ఉంచటం, అన్ని స్పెషాలిటీస్‌కు ఒక్కటే ఆపరేషన్ థియేటర్ ఉందని తెలిపారు. వెయిటింగ్ రూమ్ లేకపోవటం, స్త్రీ, పురుషులకు విడిగా టాయిలెట్ సౌకర్యం లేకపోవటం, స్టేరిలైజేషన్ బయట ఉండటం, వ్యాధులు సోకకుండా ఉండేందుకు తగిన ఏర్పాట్లు చేయకపోవడం, అవుట్ పేషెంట్ రిజిస్టర్ సరిగ్గా రాయకపోవటం, ఎంటిపి పర్మిషన్ లేకపోయినా అబార్షన్లు జరుగుతున్నా యన్నారు. ఇఎస్ఐ పర్మిషన్ సర్టిఫికెట్, స్పెషాలిటీ సర్వీస్‌ల బోర్డు డిస్‌ప్లే ఉంచకపో వడం లాంటివి గుర్తించి ఆస్పత్రి నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నట్టు గుర్తించామని తెలిపారు. ఆపరేషన్ థియేటర్‌ను సీజ్ చేసి, సరైన వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసు జారీ చేసినట్టు తెలిపారు.

పట్టాలిచ్చే వరకు కదిలేదేలే

- గుడిసెల కూల్చివేత అప్రజాస్వామికం
- పేదలకు ఇళ్ల పట్టాలిచ్చి మాట నిలుపుకోవాలి
- కొట్లాడితేనే ఇళ్ల స్థలాలు సాధ్యం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య



కూల్చివేసిన గుడిసెలను పరిశీలిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ ఎస్ వీరయ్య, తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్లులేని పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టాలిచ్చే వరకు గుడిసెలేసుకున్న స్థలాల నుంచి కదిలే ప్రసక్తిలేదు. ప్రభుత్వ స్థలాల్లో నిరుపేదలు వేసుకున్న ఇళ్లను కూల్చివేయడం అప్రజాస్వామికం. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం పేదలకు ఇళ్ల స్థలాలిచ్చి మాట నిలుపుకోవాలి. రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కును కాలరాస్తే సహించేది లేదు. పేదలంతా ఐక్యంగా కొట్లాడితే తప్ప ఇళ్ల స్థలాలు సాధించకోవడం సాధ్యం కాదు" అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ వీరయ్య అన్నారు. సంగారెడ్డి పట్టణంలోని ఓ ప్రభుత్వ స్థలంలో పేదలు వేసుకున్న గుడిసెల్ని అధికారులు కూల్చి వేసిన విషయం తెల్సుకున్న సిపిఎం బృందం ఆదివారం సందర్శించారు. పేదల్ని కలిసి ఇళ్ల స్థలాల పోరాటానికి ఎర్రజెండా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎస్ వీరయ్య మాట్లాడుతూ.. సంగారెడ్డి పట్టణంలో వందలాదిమంది పేదలేసుకున్న గుడిసెల్ని రెవెన్యూ అధికారులు, పోలీసులు నేల మట్టం చేయడం సరైంది కాదన్నారు. రాష్ట్రంలోని 19 జిల్లాల్లో ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలు ప్రభుత్వ స్థలాల్లో లక్షకుపైగా గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారన్నారు. వీరందరికీ గతంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం ఇళ్ల స్థలాలిస్తామని చెప్పి దాటవేసిందని గుర్తుచేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఎక్కడా పేదలకిచ్చిందిలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.ఐదు లక్షల ఆర్థిక సహాయం ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇస్తామని, ఇంటి స్థలాల్లేని పేదలందరికీ ఇళ్ల స్థలాలిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటినా రాష్ట్రంలో ఎక్కడా ఏ ఒక్క నిరుపేదకు ఇళ్ల స్థలాలివ్వలేదని విమర్శించారు. ప్రజలు గుడిసెలేసుకుంటే పట్టాలెట్లా ఇస్తామని ప్రభుత్వం చెప్పడం సహేతకంగా లేదన్నారు. ఇళ్లు లేని పేదలు ప్రభుత్వ స్థలాల్లో వంద గజాల వరకు ఇల్లు కట్టుకుంటే హక్కు కల్పించాలని రాజ్యాంగమే చెప్పిందన్నారు. ప్రజలకు రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కును ప్రభుత్వాలు కాలరాస్తే సహించేదిలేదని స్పష్టంచేశారు. మహబూబాబాద్, హన్మకొండ, జడ్చర్ల, కోరుట్ల, సంగారెడ్డి, వరంగల్, బచ్చన్నపేట వంటి ప్రాంతాల్లో పేదలేసుకున్న ఇండ్లను కూల్చివేయడం ప్రభుత్వ దమననీతికి అద్దం పడుతుందన్నారు. ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇళ్ల స్థలాల్ని కేటాయించడం ఇష్టలేని రాష్ట్ర ప్రభుత్వం ఆయా స్థలాలను అమ్ముకుని ఖజానా నింపుకోవాలని చూస్తుందన్నారు. ఇచ్చిన మాట నిలుపులేని ప్రభుత్వాలపై కొట్లాడితే తప్ప ఇళ్ల స్థలాల్ని సాధించుకోవడం సాధ్యం కాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పేదలంతా ఎక్కడిక్కడ ఐక్యంగా నిలబడి పట్టాలిచ్చే వరకు వేసుకున్న గుడిసెల్లోనే నివసిస్తూ పోరాడాల్సిన అవసరముందని తెలిపారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే రాష్ట్రంలో ప్రభుత్వ స్థలాల్లో పేదలు వేసుకున్న ఇళ్లకు పట్టాలిచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం సంగారెడ్డి జిల్లా కార్యదిర్శ వర్గ సభ్యులు అతిమేల మాణిక్యం, జిల్లా కమిటీ సభ్యులు ఎం.యాదగిరి, ఇళ్ల స్థలాల పోరాట నాయకులు మణి, లలిత, సుజాత, రాజయ్య, దత్తు, సాయిలు, పద్మ పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణతోనే దేశం బలోపేతం

- లండన్‌లో ప్రజా దీవెన సభ
- టిపిసిసి ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ వేణుగోపాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజ్యాంగ పరిరక్షణతోనే దేశం బలోపేతమవుతోందని టిపిసిసి ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ గంప వేణుగోపాల్ తెలిపారు. ఆదివారం లండన్‌లో ప్రజా దీవెన సభ పేరుతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, మానవ హక్కులకు రక్షణ ఉండాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. బిజెపి ప్రభుత్వంలో అనేక చట్ట ఉల్లంఘనలు జరిగాయని తెలిపారు. ఎలక్టోరల్ బాండ్ విధానం ద్వారా బిజెపి ప్రపంచ చరిత్రలోనే అతి పెద్ద అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. ఒక్క ఆరబిందో ఫార్మా ద్వారానే 50 మిలియన్లను బిజెపి తీసుకుందని ఆరోపించారు. ఇందులో బిఆర్ఎస్ కూడా తక్కువేమీ కాదని విమర్శించారు. బిజెపి పాలనలో మీడియా సంస్థలతోపాటు ప్రతిపక్ష పార్టీలపై నియంతృత్వం కొనసాగుతుందని తెలిపారు. ప్రధాన కార్యదర్శి శ్రీధర్ నీలా అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో టిపిసిసి ఎన్ఆర్ఐ సెల్ కో కన్వీనర్ సుధాకర్ గౌడ్, టిపిసిసి కార్యవర్గ సభ్యులు శీలం శ్రీనివాస్‌రెడ్డి, మధుకర్ రెడ్డి, అమరపాల్ రెడ్డి, మరుపల్లి అవినాష్ గౌడ్, అభినవ్ రెడ్డి, కిట్టు రెడ్డి, రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి ఇద్దరు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రమాదవశాత్తు చెరువులో పడి ఇద్దరు మృతి చెందిన ఘటన నిజామాబాద్ జిల్లా సాలూర మండలంలోని కుమ్మన్‌పల్లి గ్రామం సమీపంలోని చెరువులో జరిగింది. బోధన్ రూరల్ ఎస్ఐ నాగనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. సాలూర క్యాంప్ గ్రామానికి చెందిన గాదె మనోజ్‌రెడ్డి (22), మనోజ్ కుమార్ (22) యువకులిద్దరూ స్నేహితులు. ఎప్పటిలాగే ఇద్దరూ కలిసి శనివారం సాయంకాలం నడకలో భాగంగా కుమ్మన్‌పల్లి చెరువు వైపు వెళ్లారు. అక్కడ వారి కాళ్లకు బురద అంటుకోవడంతో కడుక్కోవడానికి చెరువులోకి దిగగా ప్రమాదవశాత్తు కాలుజారి పడ్డారు. ఈ క్రమంలో వారికి ఈత రాకపోవడంతో చెరువులో గల్లంతయ్యారు. బయటకు వెళ్లిన ఇద్దరు యువకులు ఎంతకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు పలుచోట్ల గాలించారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం స్థానికులు చెరువు వైపు వెళ్లగా వారి మృతదేహాలు నీటిపై తేలాయి. దాంతో వారు బోధన్ రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను గజ ఈతగాళ్ల సహాయంతో వెలికితీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు బోధన్ రూరల్ ఎస్ఐ నాగనాథ్ తెలిపారు.

బిటి రణదివే గొప్ప విప్లవకారుడు

- సిఐటియు రాష్ట్ర కోశాధికారి రాములు



సెమినార్‌లో మాట్లాడుతున్న వంగూరి రాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గొప్ప విప్లవకారుడు, మేధావి బిటి రణదివే అని సిఐటియు రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు అన్నారు. బిటి రణదివే వర్ధంతి సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఇసిఐఎల్ కమలానగర్‌లోని సిఐటియు జిల్లా కార్యాలయంలో 'సామాజిక సమస్యలు-కార్మిక వర్గం కర్తవ్యం' అంశంపై సిఐటియు నాయకులు శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆనాడు బిటి రణదివే చెప్పిన విషయాలు నేడు అక్షర సత్యాలు అవుతున్నాయన్నారు. కుల నిర్మూలనకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేయాలని ఆనాడే బిటి పిలుపునిచ్చారని, ఆయన చెప్పినట్టుగా నేటికీ కుల వివక్షత, కార్మిక దోపిడీ జరుగుతోందని తెలిపారు. ఈ 14 రోజులు వారోత్సవాల్లో పాల్గొనాలన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేసి, బిటి మార్గంలో నడవడమే మనం ఆయనకిచ్చే నివాళి అని అన్నారు. సిఐటియు రాష్ట్ర నాయకులు ప్రసాద్ మాట్లాడుతూ.. బిటి అనేక పోరాటాలు చేశారని, మహిళలు, కార్మికులను పోరాటబాట పట్టించారని చెప్పారు. కార్మిక ఐక్యత కోసం కృషి చేశారన్నారు. కోవిడ్ సమయంలో చాలా కంపెనీలు మూత పడటంతో కార్మికులు రోడ్డున పడ్డారని, రోజురోజుకు దేశంలో నిరుద్యోగ సమస్య పెరిగిపోతోందని తెలిపారు. ఆకలి చావులు కూడా ఎక్కువయ్యాయని, లక్షా 27 వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నట్టు చెప్పారు. పాలకుల ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. గత ఎన్నికల సమయంలో ప్రధాని మోడీ ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. మీడియా మొత్తాన్ని బిజెపి కొనేసిందని, సమస్యలపై మీడియాలో ఇటీవల చర్చలు జరగడం లేదని అన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఐక్య పోరాటాల కోసమే సిఐటియు ఏర్పాటయిందన్నారు. ఆర్ఎస్ఎస్ బలపడి ప్రజలు, మతాల మధ్య చిచ్చు పెడుతోందని తెలిపారు. ముస్లింలు దేశ ద్రోహులు అనేలా బిజెపి వ్యవహరిస్తోందని.. మతసామరస్యాన్ని కాపాడుకోవడానికి సిఐటియు అండగా ఉంటుందన్నారు. సిఐటియు బలపడితే తప్ప మతోన్మాదాన్ని తిప్పి కొట్టలేమని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ లక్ష్యాలను కాపాడుకోవాలి

- ఓటర్లకు ఎమ్మెల్సీ అలుగుబెల్లి పిలుపు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాజ్యాంగాన్ని రక్షించే వారినీ, ఆ లక్ష్యాలను కాపాడే రాజకీయ పార్టీ అభ్యర్థులను ఎంపిలుగా ఎన్నుకోవాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఓటర్లకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో వచ్చే నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో రాజ్యాంగం ప్రకారం పాలించే వారినే పార్లమెంట్ సభ్యులుగా ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత పదేండ్లుగా దేశాన్ని పాలించిన వారు రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తూ పాలన కొనసాగించారని తెలిపారు. ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించారని పేర్కొన్నారు. భిన్నత్వంలో ఏకత్వంతో మెలిగే ప్రజలను చీల్చేందుకు కుట్రలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ అబద్దాలకోరుగా మారారని విమర్శించారు. ప్రస్తుత రాజ్యాంగాన్ని మార్చేందుకు మరోసారి అధికారం కావాలని బిజెపి ఓట్లడుతుగుతుందని గుర్తు చేశారు. ప్రజలకిచ్చిన వాగ్దానాలు ఏ ఒక్కటి అమలు చేయకుండా దాట వేస్తున్నారని విమర్శించారు.

కేజ్రీవాల్‌ను విడుదల చేయాలి

- ఆప్ సామూహిక నిరాహారదీక్ష
- కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, ఆర్ఎస్‌పి మద్ధతు


ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను బేషరతుగా విడుదల చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసనల్లో భాగంగా ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని ధర్నాచౌక్ వద్ద సామూహిక నిరాహారదీక్ష చేపట్టారు. ఈ దీక్షకు కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, ఆర్ఎస్పీ పార్టీలు మద్ధతు తెలిపాయి. కేజ్రీవాల్ అరెస్టు కేవలం ప్రతిపక్షాల ప్రశ్నించే గొంతులను అణచివేయడంలో భాగమేనని ఆయా పార్టీల నేతలు విమర్శించారు.మాజీ ఎమ్మెల్యే, సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ కేజ్రీవాల్‌ను ఏదో ఒక విధంగా లొంగదీసుకోవాలని బిజెపి మొదట్నుంచి ప్రయత్నిస్తోందని విమర్శించారు. వివిధ రూపాల్లో ఢిల్లీ ప్రభుత్వ అధికారాలను తగ్గిస్తూ నిర్వీర్యం చేస్తోందని తెలిపారు. అయినప్పటికీ ఆప్ రోజు రోజుకు బలపడుతుండటంతో ఢిల్లీ లిక్కర్ స్కాం పేరుతో అరెస్టు చేశారని చెప్పారు. మోడీ విధానాలను వ్యతిరేకించే కేజ్రీవాల్ డబ్బుల కోసం కక్కుర్తి పడే ప్రసక్తే లేదన్నారు. ఇండియా కూటమి ఏర్పాటు, నాలుగైదు రాష్ట్రాల్లో బిజెపికి వ్యతిరేకంగా ప్రభావం చూపించగల సత్తా ఆప్‌కు ఉండటంతో కేజ్రీవాల్‌ను జైలుకు పంపించారన్నారు. ఇడి, సిబిఐ బిజెపి జేబు సంస్థలుగా, ఆదానీ, అంబానీలు ఎటిఎంలుగా మారారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు వ్యతిరేక చట్టాలు తెచ్చి, జిఎస్‌టితో సామాన్యులు, మధ్య తరగతిని మోడీ దోచుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ కేజ్రీవాల్‌ను నేరుగా ఎదుర్కోలేక ఇడి, సిబిఐలను అడ్డుపెట్టుకుని అక్రమ అరెస్టు చేశారని విమర్శించారు. బిజెపి అవినీతికర ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారం బయటికి రావడంతో దానిపై చర్చను దారి మళ్లించేందుకే ఈ చర్య చేపట్టారని తెలిపారు.సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాలమల్లేశ్ మాట్లాడుతూ మతోన్మాద వ్యతిరేక పోరాటంలో అందరం భాగస్వాములవుదామని పిలుపునిచ్చారు. ప్రశ్నించే గొంతులను నొక్కేస్తూ 400 సీట్లు తెచ్చుకునేందుకు మోడీ కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ఆర్ఎస్‌పి తెలుగు రాష్ట్రాల కార్యదర్శి జానకి రాములు మాట్లాడుతూ రామజపం చేస్తున్న మోడీ మనువాద రాజ్యాన్ని నడిపిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తూ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఎన్నికల వేళ చర్చను దారి మళ్లిస్తున్నారని తెలిపారు. దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ మనువాద బిజెపి భావజాలానికి ఎదురొడ్డి నిలబడ్డ కేజ్రీవాల్ ను చూసి ప్రధాని మోడీ భయపడి జైళ్లో వేశారని విమర్శించారు. ఢిల్లీ మద్యం కేసులో నిందితులు శరత్ చంద్రారెడ్డి ఎనిమిది సార్లు తాను కేజ్రీవాల్‌ను కలవలేదని చెప్పారని గుర్తుచేశారు.

ప్రముఖ న్యాయవాది, ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు సొలొమోన్ రాజు మాట్లాడుతూ సిఎంగా విధులు నిర్వర్తించిన అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడాన్ని తప్పుపట్టారు. ఈ ధర్నాలో ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాముగౌడ్, ఎం.ఎ.మాజీద్, మహిళా విభాగం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హేమ జిల్లోజు, నర్సింగ్ యమున గౌడ్, అధికార ప్రతినిధి జావేద్ షరీఫ్, వికలాంగుల విభాగం కన్వీనర్ దర్శనం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బండ్లగూడ రత్నదీప్ సూపర్ మార్కెట్‌లో అగ్ని ప్రమాదం

- మరమ్మతులు చేస్తుండగా చెలరేగిన మంటలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలో ప్రారంభానికి సిద్ధమవుతున్న రత్నదీప్ సూపర్ మార్కెట్‌లో ఆదివారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ సన్‌సిటీలోని రత్నదీప్ సూపర్ మార్కెట్‌లో మరమ్మతులు చేస్తుండగా మంటలు చెలరేగాయి. మంటలతో దట్టమైన పొగ వ్యాపించడంతో రత్నదీప్ యాజమానులు, సిబ్బంది బయటకు పరుగులు పెట్టారు. వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. రెండు ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశాయి. నార్సింగి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటనకు గల కారణాలపై ఆరా తీశారు. ఈ ఘటనలో ప్రారంభానికి తీసుకొచ్చిన వస్తువులు, ప్లాస్టిక్ కుర్చీలు, టేబుల్స్, ఇతర సామాగ్రి పూర్తిగా ఖాళీ బూడిదైపోయినాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు నార్సింగ్ సీఐ ప్రవీణ్ కుమార్‌రెడ్డి తెలిపారు. అయితే రత్నదీప్ సూపర్ మార్కెట్ యజమాన్యం ఎలాంటి ఫైర్ నిబంధనలను పాటించడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు, అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

కెసిఆర్, హరీష్ రావు మాటలన్నీ అబద్ధాలు

- పంటల నష్టంపై తప్పుడు ప్రచారాలు మానాలి
- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, మాజీమంత్రి హరీష్ రావు పంటల నష్టంపై శుద్ధ అబద్ధాలు మాట్లాడుతున్నారని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమిరెడ్డి కృపాకర్‌రెడ్డి ఆత్మీయ సన్మానం కార్యక్రమంలో చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో మహారాష్ట్ర, కర్ణాటక సహా తెలంగాణలో వర్షాలు అనుకున్న స్థాయిలో కురవకపోవడం వల్ల నదుల్లో నీళ్ల పారడం లేదని, బావులు, బోర్లు రీఛార్జ్ కాలేకపోయాయని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రెండు లక్షల ఎకరాల వరకు పంటలు ఎండిపోతే కెసిఆర్, హరీష్‌రావు పదింతలు సంఖ్య పెంచి 20 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. పొలాలు ఎండిపోయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందన్న భరోసా రైతుల్లో ఉందన్నారు. కానీ రాజకీయ నిరుద్యోగులైన కెసిఆర్, హరీష్‌రావులు అనవసరంగా నానా హైరానా పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

బిజెపిని ఒక్క సీటు గెలవనీయం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య



విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిజెపిని ఒక్క ఎంపి సీటు కూడా గెలవనీయబోమని, బిజెపిని ఓడించేందుకు విపక్షాలను కలుపుకుపోయే బాధ్యత కాంగ్రెస్‌దేనని, అలాంటి ప్రయత్నం ఆ పార్టీ నుంచి కనిపించడంలేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య అన్నారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో నిర్వహించిన సిపిఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బిజెపి మతోన్మాద, కార్పొరేట్ అనుకూల విధానాల పట్ల దేశ వ్యాప్తంగా తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతుందన్నారు. పదేళ్ల బిజెపి పాలనలో చేసిన విధ్వంసానికి ఈ ఎన్నికల్లో దేశ ప్రజలు తగిన గుణపాఠం నేర్పి చరమగీతం పాడాల్సిన అవసరముందన్నారు. రాజ్యాంగాన్ని మార్చేసి ఆ స్థానంలో మనుధర్మాన్ని తీసుకొచ్చి ఫ్యూడల్ భావజాలం వైపు తీసుకుపోయేందుకు బిజెపి కుట్ర చేస్తుందని తెలిపారు. కుల, మత, ప్రాంతీయ, భాషా విద్వేషాలను రెచ్చగొట్టి, మతాన్ని రాజకీయ అస్త్రంగా వాడుకుని ఎన్నికల్లో మోడీ లబ్ధిపొందాలని చూస్తున్నారన్నారు. వంద కోట్ల మంది భారతీయులు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నరంటూ ఐక్య రాజ్య సమితి పేర్కొన్నదంటే మన పాలకుల చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతోందని తెలిపారు. ధరల పెరుగుదల వల్ల ప్రజల కొనుగోలు శక్తి పడిపోయిందని, నిరుద్యోగ సమస్య తీవ్రమవుతుందన్నారు. బిజెపిని ఓడించేందుకు దేశవ్యాప్తంగా విపక్షాలు ఐక్యమై ఇండియా కూటమిగా ఏర్పడిందన్నారు. ప్రజలకు ఎన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల పాలనలో ప్రజా సమస్యల పరిష్కారం అంతంత మాత్రమేనన్నారు. ఇళ్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలిస్తామని హామీ ఇచ్చి ఏ ఒక్కరికి కూడా పట్టాలివ్వలేదన్నారు. పైగా వేసుకున్న గుడిసెల్ని కూల్చి కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భువనగిరి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థి ఎండీ జహంగీర్ గెలుపునకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. సంగారెడ్డి సిపిఎం జిల్లా కమిటీ తరపున జహంగీర్ గెలుపు కోసం లక్ష రూపాయల్ని సహాయంగా అందజేయడం అభినందనీయమన్నారు.

సామాజిక ఉద్యమాలను బలపర్చండి: చుక్క రాములు

సామాజిక ఉద్యమాలను బలపర్చాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు పిలుపునిచ్చారు. కార్మికోద్యమ నేత బీటీ రణదీవె వర్ధంతి ఏప్రిల్ ఆరు నుంచి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సామాజిక సంఘీభావ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళిత, బహుజన, మైనార్టీల సమస్యల్ని పరిష్కరించకుండా కేవలం వారిని ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే వాడుకుంటున్నాయన్నారు. సమావేశం లో సిపిఎం జిల్లా కార్యదర్శి జి జయరాజ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె రాజయ్య, బి మల్లేశం, ఎ మాణిక్యం, రామచంద్రం, జిల్లా కమిటీ సభ్యులు, పాండురంగారెడ్డి నాయకులు పాల్గొన్నారు.

పేదల కన్నీళ్లు తుడిచేది సిపిఎం మాత్రమే..

- గుడిసెవాసులకు అండగా ఉంటాం
- బెదిరింపులకు భయపడేది లేదు
- స్టాలిన్ నగర్‌ను సందర్శించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి సాగర్, మల్లు లక్ష్మి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వ భూమిలో పేదలకు ఇంటి స్థలాలతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. రియల్ ఎస్టేట్ వ్యాపారుల వైపా.. పేదల వైపు.. ఉంటుందో తేల్చుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్, మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. ఆదివారం గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ పరిధి పైడిపల్లి శివారులోని ఎస్సారెస్పీ కాలువ సమీపంలో స్టాలిన్ నగర్ పేరుతో సిపిఎం ఆధ్వర్యంలో పేదలు వేసుకున్న గుడిసెలను శనివారం తెల్లవారుజామున అధికారులు కూల్చివేసిన విషయం తెలిసిందే. కాగా, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్, మల్లు లక్ష్మితో పాటు మరికొందరు బృందం ఆదివారం ఆ కాలనీని సందర్శించి అండగా ఉంటామని బాధితులకు భరోసా నిచ్చారు. అనంతరం స్టాలిన్‌నగర్ వ్యవస్థాపక అధ్యక్షులు అక్కనపల్లి యాదగిరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాగర్ మాట్లాడారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు 125 గజాల ఇంటి స్థలంతో పాటు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కట్టిస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేకపోయిందని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం.. పేదలకు ప్రభుత్వ స్థలంలో పట్టాలిచ్చి పక్కా ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షలు ఆర్థిక సహాయం అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇవ్వడంతో పేదలు కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఈ క్రమంలో పైడిపల్లి శివారులోని ఎస్సారెస్పీ కాలువ సమీపంలో సిపిఎం ఆధ్వర్యంలో రెండేండ్ల క్రితం 1560 నిరుపేద కుటుంబాలు వేసుకున్న గుడిసెలకు పట్టాలిచ్చి ఇంటి నిర్మాణానికి సహాయం చేయవలసిన ప్రభుత్వం అర్ధరాత్రి ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా జేసీబీలతో కూల్చడం హేయమైన చర్య అని అన్నారు. కూలీ, నాలి చేసుకునే పేదలు.. ఒక్కొక్కరు రూ.30 వేల నుంచి లక్ష రూపాయల వరకు అప్పులు చేసి నిర్మించుకున్న ఇండ్లను నిర్ధాక్షణంగా కూల్చడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ప్రభుత్వ బెదిరింపులకు భయపడేది లేదని, స్టాలిన్‌నగర్ గుడిసె వాసులకు న్యాయం జరిగే వరకూ సిపిఎం అండగా ఉంటుందన్నారు. అనంతరం మల్లు లక్ష్మీ మాట్లాడుతూ.. వృద్ధులు, మహిళలు చిన్నపిల్లలు నిద్రలో ఉండగా అర్ధరాత్రి వేళ పోలీసులు పేదల ఇండ్లను కూల్చడమే కాకుండా మహిళల పట్ల దురుసుగా ప్రవర్తించడం బాధాకరమన్నారు. వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ పార్టీ నాయకులు ఆక్రమిస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర కమిటీ సభ్యులు స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ.. దళితులు, మైనారిటీలు వెనుకబడిన తరగతులకు చెందిన పేదలు నివాసం ఉంటున్న గుడిసెలను తొలగించిన అధికారులు.. ధనవంతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకున్న ప్రభుత్వ స్థలాల జోలికి ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రమేష్ మాట్లాడుతూ.. విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు నివాస స్థలాల కోసం సిపిఎం ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకుంటే వాటిని ప్రభుత్వం తొలగించడాన్ని ఖండిస్తున్నట్టు చెప్పారు. సిపిఎం వరంగల్ జిల్లా కార్యదర్శి రంగయ్య మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాలో 30 ఏళ్లుగా అనేక భూపోరాట కేంద్రాలు నిర్మించి వేలాదిమందికి ఇంటి స్థలాలు ఇచ్చిన చరిత్ర సిపిఎందని గుర్తుచేశారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో స్టాలిన్‌నగర్ పేరుతో పేదలు వేసుకున్న గుడిసెలను తొలగించడం బాధాకరమని, తక్షణమే గుడిసెలు తొలగించిన ప్రభుత్వ భూమిలోని ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కాసు మాధవి మాట్లాడుతూ.. పేదరికంలో ఉన్న వందలాదిమంది కార్మిక కుటుంబాలు స్టాలిన్ నగర్‌లో గుడిసెలు వేసుకుంటే అర్ధరాత్రి దాడి చేసి తొలగించడం బాధాకరమని వారికి న్యాయం జరిగే వరకు సిఐటియు అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం వరంగల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈసంపల్లి బాబు, గోనె కుమారస్వామి జిల్లా కమిటీ సభ్యులు ఎం.సాగర్, నామిండ్ల స్వామి, హనుమకొండ శ్రీధర్, ఆరూరి కుమార్, కాశిబుగ్గ ఏరియా కార్యదర్శి ఎండీ బషీర్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి దుర్గయ్య, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సాంబమూర్తి, స్టాలిన్ నగర్ నాయకులు పాల్గొన్నారు.